సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



పదిమంది గంజాయి నిందితుల అరెస్ట్
విజయనగరం రైల్వేస్టేషన్ వద్ద గంజాయి విక్రయిస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. -8లో



ఆగిపోయిన మొబైల్ ఐసీటీసీ సేవలు
హెచ్ఐవీ మహమ్మారి నిర్మూలనలో అత్యంత కీలక ప్రాత వహించే మొబైల్ ఐసీటీసీ వాహన సేవలు నిలిచిపోయాయి. -8లో



తైక్వాండోలో మాస్టర్స్ తండ్రీకూతుళ్లు
ఆత్మరక్షణ విద్య తైక్వాండోలో విజయనగరం జిల్లాకు చెందిన తండ్రీకూతుళ్లు మాస్టర్స్ సాధించారు. -8లో

వైద్యులకు రక్షణ అవసరం



రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులకు రక్షణ కావాలి. వైద్యులపై ప్రతి ఒక్కరికీ గౌరవభావం ఉండాలి. ప్రతి వైద్యుడు అంకిత భావంతో వైద్యసేవలు అందిస్తారన్న విషయం గుర్తించాలి. వైద్యులపై దాడులకు పాల్పడితే రోగులకు చికిత్స అందించేందుకు వెనుకాడుతారు. కోల్‌కతాలో వైద్యవిద్యార్థినిపై హత్యాచార ఘటన దారుణం.

– డాక్టర్ అరుణ శుభశ్రీ, గైనికాలజీ హెచ్ఓడీ, ఘోషా ఆస్పత్రి

దాడులు తగవు



వైద్యులు, సిబ్బందిపై భౌతిక దాడులు చేయడం సరికాదు. సమస్య ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేయాలి. దాడులు చేయడం వల్ల వైద్యసిబ్బంది ధైర్యం కోల్పోతారు. మనస్ఫూర్తిగా సేవలు అందించలేరు. రోగులతో వచ్చే వారు అర్థం చేసుకోవాలి. వైద్యసేవలకు సహకరించాలి.

– శైలజ, ల్యాబ్‌టెక్నీషియన్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

సెక్యూరిటీ పెంచాలి



క్యాజువాలటీ, వార్డుల్లో మూడు షిఫ్టుల్లో వైద్య సిబ్బందికి సెక్యూరిటీ, పోలీస్ సిబ్బందిని రక్షణగా నియమించాలి. ఎక్కడైనా సమస్య వస్తే సంప్రదించేందుకు ఫోన్ నంబర్లు డిస్‌ప్లే చేయాలి. వైద్య సిబ్బందికి తగిన వసతులు కల్పించాలి.

– శిరీష, జనరల్ డ్యూటీ అటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

న్యూస్‌రీల్

నేడు సీతంపేట ఏజెన్సీలో కలెక్టర్ పర్యటన

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ శుక్రవారం పర్యటించనున్నారు. ముందుగా టీటీడీ దేవాలయాన్ని దర్శించుకుంటారు. అనంతరం వైటీసీలో గర్భిణుల వసతి గృహాన్ని ప్రారంభిస్తారు. హడ్డుబంగిలో పీఎం జన్‌మన్ గ్రామ సభలో పాల్గొంటారు. కె.గుమ్మడలో గోకులంను సందర్శించాక దిబ్బగూడలో వీడీవీకే సభ్యులతో సమావేశమవుతారు. సాయంత్రం అడ్వంచర్‌పార్కు, ట్రిబుల్ మ్యూజియం, ఆడలి వ్యూపాయింట్, మెళ్లి ఏపీఆర్ కళాశాలను సందర్శిస్తారని ఐటీడీఏ వర్గాలు తెలిపాయి.

31న ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

పార్వతీపురం: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఈ నెల 31వ తేదీన పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీన ఆదివారం సెలవుదినం కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఆ రోజు తీసుకోని వారు సెప్టెంబర్ 2వ తేదీన పింఛన్లు పొందవచ్చన్నారు. జిల్లాలోని 15 మండలాల్లో 1.42 లక్షల మంది లబ్ధిదారులకు రూ.59.37 కోట్లను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

పాతదుగ్గిలో గజరాజుల సంచారం



పాతదుగ్గిలో సంచరిస్తున్న గజరాజులు

కొమరాడ: మండలంలోని నాగవళి నదీ పరివాహక ప్రాంతమైన పాత దుగ్గి పరిసరాల్లో గురువారం గజరాజులు సంచరించాయి. దుగ్గి, కళ్లికోట, గుణానపురం తదితర గ్రామాల ప్రజలను అటవీశాఖ సిబ్బంది అప్రమత్తం చేశారు. ఆర్తాం నుంచి కళ్లికోట, దుగ్గివైపు ప్రయాణికులు రాత్రిపూట ప్రయాణం చేయొద్దని హెచ్చరికలు జారీ చేశారు. రైతులు రాత్రిపూట పొల్లాలోకి వెళ్లవద్దని దండోరా వేయించారు.

అందుబాటులో బ్యాంకింగ్ సేవలు



జ్యోతి ప్రజ్వలన చేసి బ్యాంకు కొత్త బ్రాంచిను ప్రారంభిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: బ్యాంకు సేవలు అన్నివర్గాల వారికి చేరువయ్యేలా ఆయా బ్యాంకు యాజమాన్యాలు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. విజయనగరం చినవీధిలో ఆధునీకరించిన బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచిని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకుల ఆధునికీకరణతో ఖాతాదారులకు మెరుగైన సేవలందుతాయన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా డిప్యూటీ జనరల్ మేనేజర్ పీఎం పఠాన్ మాట్లాడుతూ నగరంలో తమ బ్యాంకుకు మూడు బ్రాంచిలున్నట్టు చెప్పారు. తమ బ్యాంక్ ద్వారా గృహ, వాహన రుణాలను తక్కువ వడ్డీకే అందిస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ మెహర్‌చైతన్య పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక అక్షరాస్యత అవసరం

- నాబార్డు ఏజీఎం టి.నాగార్జున



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగార్జున

గంట్యాడ: మహిళలు ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని నాబార్డు ఏజీఎం టి.నాగార్జున అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం 'మహిళల ఆర్థిక అక్షరాస్యత' అనే అంశంపై గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిజిటల్ లావాదేవీల్లో జరుగుతున్న మోసాలను తెలుసుకోవాలన్నారు. వెలుగు ఏపీడీ సావిత్రి మాట్లాడుతూ సంఘ సభ్యులు తమ పొదుపును ముందుగా అంతర్గ అప్పుగా వాడుకోవాలని సూచించారు. సుస్థిరమైన జీవనోపాధులు ఏర్పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ మూర్తి, ఏపీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పాత సీసాలో కొత్తమద్యం!



- 'ప్రైవేటు' మద్యందుకాణాలపై కూటమి ప్రభుత్వం చూపు
- ఉమ్మడి విజయనగరం జిల్లాలో 202 మద్యం దుకాణాల ఏర్పాటుకు సన్నాహాలు!
- టెండర్ల ద్వారా కేటాయించే ప్రయత్నం
- స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌లో విలీనం

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పథకాల పేర్లు మార్పుతోపాటు కొన్ని వ్యవస్థలను తమకు అనుకూలంగా మార్చుకుంటోంది. దీనికి సంబంధించి జీవోలు జారీచేస్తోంది. తాజాగా ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న మద్యం పాలసీపై దృష్టి పెట్టింది. నూతన మద్యం పాలసీ (2014–19 మధ్య టీడీపీ హయాంలో అమలులో ఉన్నది)ను అమలు చేయడానికి అనధికారికంగా ఇప్పటికే ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ నుంచి నివేదిక తెప్పించుకున్నట్టు సమాచారం. మరో నెలరోజుల్లో నూతన మద్యం పాలసీపై విధివిధానాలు వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నెలరోజుల్లో స్పష్టత

నూతన మద్యం పాలసీపై మరో నెల రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పక్క రాష్ట్రాల్లో మద్యం పాలసీలను అధ్యయనం చేయడం, జిల్లాలో జనాభా ప్రాతిపదికన ఎన్ని దుకాణాలు పెట్టాలి, దరఖాస్తు రుసుము, లైసెన్సు ఫీజులు, దుకాణాల ఏర్పాటుపై నిబంధనలు తదితర విషయాలను పరిగణనలోకి తీసుకోనున్నట్టు సమాచారం. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో విజయనగరంలో ఏడు నియోజకవర్గాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం విజయనగరం జిల్లాలో 149, పార్వతీపురం మన్యం జిల్లాలో 53 మొత్తం ఉమ్మడి విజయనగరం జిల్లాలో 202 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇవి కాకకుండా గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటయ్యే అవకాశం ఉందని ఆబ్కారీశాఖ అధికారులు చెబుతున్నారు. మద్యం విక్రయాలు భారీగా పెంచాలన్నదే ప్రభుత్వ ఉద్దేశంగా తెలుస్తోంది.

'ప్రైవేటు' అనివార్యం

టీడీపీ ఇచ్చిన మేనిఫెస్టోలో కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని పేర్కొంది. ఇది పరోక్షంగా ప్రైవేటు మద్యం దుకాణాల రాకను సూచిస్తోంది. 2019 ముందు వరకు జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాల ద్వారానే మద్యం విక్రయాలు జరిగేవి. ప్రతి రెండేళ్లకు ఓసారి మద్యం దుకాణాలకు టెండర్లు పిలవడం, లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు జరిగేది. ఉమ్మడి విజయనగరం జిల్లాగా ఉండేటప్పుడు 297 మద్యం దుకాణాలు ఉండేవి. కేవలం దరఖాస్తు రుసుముల ద్వారానే సుమారు రూ.2 కోట్ల ఆదాయం వచ్చేది. ఇక ఏటా మద్యం విక్రయాల ద్వారా జిల్లాలో దాదాపు రూ.1,900 కోట్ల ఆదాయం లభించేది.

పర్యవేక్షణ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖకే...

ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ప్రస్తుతం రెండు విభాగాలుగా నడుస్తోంది. ఇందులో ఎస్ఈబీ (స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో) అక్రమ మద్యం నివారణ, మద్యం, స్మగ్లింగ్ కేసులను పర్యవేక్షిస్తూ ఎస్పీ ఆధ్వర్యంలో పనిచేస్తోంది. సహాయ కమిషనర్ నుంచి జిల్లాలో ఎస్ఈబీ పోలీస్ స్టేషన్లు ఇందుకోసం పనిచేస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ మద్యం డిపోల నిర్వహణ, ప్రభుత్వ మద్యం దుకాణాల బాధ్యతను పర్యవేక్షిస్తోంది. ఇందుకోసం డిపో మేనేజర్లు, సీఐలు, ఎస్ఐలు పనిచేస్తున్నారు. కొత్త మద్యం పాలసీ తీసుకువచ్చే క్రమంలో రెండు విభాగాలను మిళితంచేస్తూ తాజాగా ప్రభుత్వం క్యాబినెట్‌లో మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం మీద పాతసీసాలో కొత్త మద్యం నింపినట్టు నూతన ఎక్సైజ్ పాలసీ గత టీడీపీ ప్రభుత్వంలో ఉన్నట్లే అమలయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

నియోజకవర్గాల వారీగా జాబ్ మేళాలు



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

పార్వతీపురం: జిల్లాలో నియోజకవర్గాల వారీగా జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ రూపొందించిన జాబ్‌మేళాల జాబ్ క్యాలెండర్లను ఎమ్మెల్యేలు విజయచంద్ర, జయకృష్ణ, జగదీశ్వరులతో కలిసి గురువారం విడుదల చేశారు. సెప్టెంబర్ నెల నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు జాబ్ మేళాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జాబ్ మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాబ్‌మేళాల వివరాలు:

- పార్వతీపురం నియోజకవర్గంలో సెప్టెంబర్ 20, అక్టోబర్ 4, నవంబర్ 11, డిసెంబర్ 10, వచ్చే ఏడాది జనవరి 21, ఫిబ్రవరి 14, మార్చి 14 తేదీల్లో సీతంపేట ప్రభుత్వ ఐటీఐ/పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆవరణలో నిర్వహించనున్నారు.
- పాలకొండ నియోజకవర్గంలో సెప్టెంబర్ 10, అక్టోబర్ 22, నవంబర్ 18, డిసెంబర్ 6, వచ్చే ఏడాది జనవరి 3, ఫిబ్రవరి 4, మార్చి 4 తేదీల్లో పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదా ఎస్వీడీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎమ్మార్‌నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జాబ్ మేళాలు జరగనున్నవి.
- సాలూరు నియోజకవర్గంలో సెప్టెంబర్ 27, అక్టోబర్ 25, నవంబర్ 29, డిసెంబర్ 17, వచ్చే ఏడాది జనవరి 10, ఫిబ్రవరి 18, మార్చి 18 తేదీల్లో సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నారు.
- కురుపాం నియోజకవర్గంలో అక్టోబర్ 8, నవంబర్ 1, డిసెంబర్ 30, వచ్చే ఏడాది జనవరి 30, ఫిబ్రవరి 27, మార్చి 28 తేదీల్లో కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదా గుమ్మలక్ష్మీపురం జీఎంఆర్ పాలిటెక్నికల్ కళాశాలలో నిర్వహించనున్నారు.

కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, ఏఎస్పీ ఎస్.అంకిత మహావీర్, పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషను కాపాడుకుందాం

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



ఛాయా చిత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, తదితరులు

పార్వతీపురం: తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. గిడుగు వెంకటరామమూర్తి పంతులు జయంతి సందర్భంగా గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. తెలుగు భాషాభివృద్ధికి కృషిచేసిన మహానుభావుల స్ఫూర్తిని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. వ్యవహారిక భాషోద్యమం కోసం జీవితాన్ని ధారపోసిన మహానుభావుడు గిడుగు వెంకటరామమూర్తి అని తెలిపారు. మాతృభాషలో నైపుణ్యం ఉన్నవారు ఇతర రంగాల్లో కూడా రాణిస్తారన్నారు. ప్రతిరోజు ఒక కొత్త తెలుగు పదం, పద్యం నేర్చుకోవాలన్నారు. పీఆర్ ఈఈ ఎంవీఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ అగ్రకులంలో పుట్టి సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన గిడుగు ఎంతో అభినందనీయులన్నారు. నవర భాషాభివృద్ధికి గిడుగు ఎంతో కృషి చేశారన్నారు.

కార్యక్రమంలో డీఈఓ జి.పగడాలమ్మ, డీపీఓ బి.సత్యనారాయణ, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి ఎల్.రమేష్, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు తెలుగు పాటలను ఆలపించగా, వాసవీ జూనియర్ కళాశాల విద్యార్థులు తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు.

గిరిజన వర్సిటీ పనులు వేగవంతం చేయండి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



విజయనగరం అర్బన్: మెంటాడ మండల పరిసరాల్లో తలపెట్టిన గిరిజన యూనివర్సిటీ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. అప్రోచ్ రోడ్డు, విద్యుత్, నీటి సరఫరా తదితర మౌలిక వసతుల కల్పన పనుల అంచనాలను సంబంధిత శాఖల అధికారులు రెండు రోజుల్లో సమర్పించాలని సూచించారు. మార్చి 2025లో తరగతి గదులు ప్రారంభించాల్సి ఉన్నందున నిధులు మంజూరైన మర్నాడే పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. తన చాంబర్‌లో గిరిజన వర్సిటీ పనులపై గురువారం సమీక్షించారు. భూసేకరణ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించాలని, కోర్టులో ఉన్న 3 ఎకరాల భూ సమస్య పరిష్కారానికి కక్షిదారులతో మాట్లాడి ఒప్పించాలని బొబ్బిలి ఆర్డీఓ సుధారాణికి సూచించారు. అక్రమణలో ఉన్న భూ వివరాలు, భూసేకరణకు ఎంత మొత్తం అవసరం అవుతుంది తదితర వివరాలు అందజేయాలని కోరారు.

అప్రోచ్ రోడ్డు భూ వివాదం పరిష్కారం కాకపోతే అలైన్మెంట్ మార్చేందుకు ఉన్న వీలును పరిశీలించాలని ఆర్అండ్‌బీ ఎస్ఈ విజయ్‌రత్నంకు సూచించారు. భూ సమస్య తీరగానే సెప్టెంబర్ 15 నుంచి రహదారి పనులను ప్రారంభించాలన్నారు. నీటి సరఫరాకు సంబంధించి రూ.6 కోట్ల విలువైన పనులను చేపట్టాల్సి ఉండగా, ఇప్పటికే 50 శాతం వరకు పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు పూర్తికి అవసరమైన బిల్లుల కోసం ప్రతిపాదనలు పంపాలని ఎస్ఈ ఉమాశంకర్‌కు ఆదేశించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి, సర్వీస్ కనెక్షన్‌కు అవసరమైన నిధుల కోసం వెంటనే అంచనాలను పంపాలని ఎస్ఈ లక్ష్మణరావుకు తెలిపారు. సంబంధిత అధికారులంతా తమ అంచనాలను పంపి మ్యాన్‌పవర్‌తో పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో సుమబాల, గిరిజన వర్సిటీ రిజిస్ట్రార్ టి.శ్రీనివాసన్, మెంటాడ, దత్తిరాజేరు తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.

పట్టుతప్పితే ప్రాణం గోవిందా..!



చిత్రంలో కనిపిస్తున్నది చీపురుపల్లి రూట్‌లో వెళ్లే పల్లె వెలుగు బస్సు. ఇంటికి చేరుకోవాలన్న తొందర.. బస్సు తప్పిపోతే మళ్లీ ఉండదన్న బెంగతో విద్యార్థులు ఇదిగో ఇలా ఫుట్‌బోర్డుపై గురువారం ప్రమాదకర ప్రయాణం సాగించారు. విద్యా సంస్థల పనివేళలకు అనుగుణంగా బస్సు సర్వీసులు లేకపోవడంతో ప్రమాదకర ప్రయాణం తప్పడంలేదని విద్యార్థులు చెబుతున్నారు. వీరి సాహస ప్రయాణం చూసిన వారు పట్టుతప్పితే ప్రాణం పోతుందంటూ ఆవేదన వెలిబుచ్చారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

సంద్రంలో 'అల'జడి



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్ర తీరంలో అలలు ఉవ్వెత్తును ఎగసిపడుతున్నాయి. రానున్న మూడు రోజులపాటు జిల్లాలోని తీరప్రాంతమైన ముక్కాం, కొండ్రాజుపాలెం, చోడిపిల్లిపేట, చేపలకంచేరు గ్రామాల్లో సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. ఈ మేరకు మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదంటూ తహసీల్దార్ ఎం.సురేష్ తీర గ్రామాల్లో గురువారం దండోరా వేయించారు. – భోగాపురం

మాదక ద్రవ్యాల నియంత్రణే లక్ష్యం



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి, పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాల నియంత్రణే లక్ష్యంగా పనిచేద్దామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, సరఫరా చేసేవారికి శిక్ష పడేలా బలమైన ఆధారాలు సమకూర్చాలన్నారు. అటవీ ప్రాంతం గుండా జరిగే రవాణాకు అటవీశాఖ అధికారులు అడ్డుకట్ట వేయాలన్నారు. గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించాలని తెలిపారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై దృష్టిసారించాలన్నారు. గంజాయి పండించేవారికి ప్రభుత్వ పథకాలను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలను రూపుమాపడమే ధ్యేయంగా చర్యలు చేపట్టామన్నారు.

గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, వినియోగ సమాచారాన్ని ప్రజలు అందించేందుకు వీలుగా ప్రత్యేక ఫోన్‌నంబర్ ఏర్పాటు చేస్తామన్నారు. అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ మాట్లాడుతూ విద్యా సంస్థలకు 300 మీటర్ల దూరంలో సిగరెట్, మద్యం, మత్తు పదార్థాల విక్రయం, సరఫరా చట్టరీత్యా నేరమన్నారు. సమావేశంలో ఏఎస్పీ ఎస్.అంకిత్ మహావీర్, పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు, పార్వతీపురం, పాలకొండ ఆర్డీఓలు కె.హేమలత, వి.వెంకటరమణ, జిల్లా అటవీ అధికారి జీఏపీ ప్రసూన, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎం.వినోద్, డీఈఓ జి.పగడాలమ్మ, ఐటీడీఏ డీడీ ఎం.రుక్మంగదయ, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రా-ఒడిశా మధ్య ఇసుక ర్యాంపు రగడ

- వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన రెండు రాష్ట్రాల అధికారులు
- దిమ్మిడిజోల ర్యాంప్ స్థలం ఒడిశాదేనంటూ వాదన
- మ్యాప్‌లు చూపించాక నిర్ణయిద్దామన్న ఆంధ్రా అధికారులు



ఇసుక ర్యాంప్ నిర్వహించిన స్థల మ్యాప్‌లను పరిశీలిస్తున్న ఉభయ రాష్ట్రాల అధికారులు

భామిని: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంమైన భామిని మండలం దిమ్మిడిజోల వద్ద వంశధార నదీ తీరంలో నిర్వహించిన ఇసుక ర్యాంప్ వివాదం పరిష్కారానికి రెండు రాష్ట్రాల అధికారులు గురువారం సంయుక్తంగా పరిశీలించారు. ఆంధ్రా తరఫున పాలకొండ ఆర్డీఓ వి.వి.రమణ, డీఐఓ వెంకటరావు, మైన్స్ ఏజీఎం కుమారస్వామి హాజరయ్యారు. ఒడిశా నుంచి గజపతి జిల్లా సబ్ కలెక్టర్ అనూక్ పండా, తహసీల్దార్ అశోక్ ప్రధాన్, మైనింగ్ ఆఫీసర్ బిపిన్ పారిడాలు పాల్గొన్నారు. గతంలో ఒడిశా ప్రభుత్వ అనుమతులతో నడిపిన ఇసుక ర్యాంప్ స్థలం ఒడిశాదేనని ఆ రాష్ట్ర అధికారులు ఆధారాలు చూపి వాదించారు. 1994లో జరిగిన ఒడిశా సెటిల్‌మెంట్ మ్యాప్‌లలో వంశధార నది ఈవల వరకు ఒడిశా జిరాయితీ భూములున్నట్టు మ్యాప్‌లతో చూపించారు. బాలేరు, దిమ్మిడిజోల రైతులకు చెందిన భూముల్లోనే ఇసుక ర్యాంప్ ఉందని ఆంధ్రా అధికారులు వాదించారు. సంబంధిత రికార్డులు చూపిస్తామని ఒడిశా అధికారులకు తెలియజేశారు. ఆధారాలు చూశాక తుది నిర్ణయానికి వస్తామని ఆంధ్రా అధికారులు తెలిపారు. గతనెల 28 తేదీన సొలికిరి రైతుల అభ్యంతరాలతో దిమ్మిడిజోల ర్యాంప్‌లో ఇసుక తవ్వకాలు నిలిపి వేసిన సంగతి తెలిసిందే.

కార్యక్రమంలో భామిని తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, సర్వేయర్ రాజేశ్వరరావు, ఆర్ఐ ఎస్.రాంబాబు, ఒడిశా పోలీస్ బృందం, లివిరి, దిమ్మిడిజోల, సొలికిరి రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం కావాలి

● ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు



ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వర రావును సన్మానిస్తున్న సెంచూరియన్ వీసీ పీకే మహంతి తదితరులు

నెల్లిమర్ల రూరల్: ఒలింపిక్ క్రీడల్లో రాణించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వర రావును వర్సిటీ ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణతో కృషి చేస్తే ఆశించిన ఫలితాలు వస్తాయని చెప్పారు. క్రీడాకారులకు ప్రభుత్వం తగినంత ప్రోత్సాహం అందించాలని కోరారు. వర్సిటీ వీసీ పీకే మహంతి మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొంటే శారీరక, మానసిక దారుఢ్యం మెరుగుపడుతుందన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ, డీన్‌లు సన్నీడయోల్, విజయబాబు, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో మాస్టర్స్ తండ్రీకూతుళ్లు



తైక్వాండోలో మాస్టర్స్ సాధించిన వేణుగోపాల రావు, యశస్విని

విజయనగరం: ఆత్మరక్షణ విద్య తైక్వాండోలో విజయనగరం జిల్లాకు చెందిన తండ్రీకూతుళ్లు మాస్టర్స్ సాధించారు. ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో గల కేల్గాం స్టేడియంలో 112 వ అంతర్జాతీయ తైక్వాండో మాస్టర్ కోర్స్, 62వ పూండాన్ ఎగ్జామినర్ కోర్స్ నిర్వహించారు. ఈ కోర్సుకు ప్రపంచ తైక్వాండో హెడ్‌క్వార్టర్స్ ఆఫీసర్, చీఫ్ ఆఫ్ వరల్డ్ తైక్వాండో అకాడమీ గ్రాండ్ మాస్టర్ జైవన్ కాంగ్, తైక్వాండో మాస్టర్స్ యూనియన్ గ్రాండ్‌మాస్టర్ వ్యవస్థాపక అధ్యక్షుడు హాంగ్ కిమ్‌లు హాజరయ్యారు. వారి పర్యవేక్షణలో జరిగిన కోర్సులో విజయనగరం జిల్లాకు చెందిన రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు, కుమార్తె సీహెచ్ యశస్విని పాల్గొన్నారు. వేణుగోపాల రావు ఇంటర్నేషనల్ మాస్టర్, హోమ్ డాన్ ఎగ్జామినర్‌గా అర్హత సాధించగా..యశస్విని ఇంటర్నేషనల్ మాస్టర్‌గా అర్హత పొందారు. మొట్టమొదటిసారిగా విజయనగరం నుంచి తండ్రీకూతుళ్లు ఈ అర్హత సాధించడం గర్వకారణమంటూ జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, చైర్మన్ సుభాష్ చంద్రబోస్, అవనాపు విజయ్‌లు వారికి అభినందనలు తెలియజేశారు.

స్టార్టప్‌లతో దేశాభివృద్ధి



పోస్టర్ ప్రజెంటేషన్‌ను వివరిస్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: దేశాభివృద్ధిలో యువ పారిశ్రామికులు రూపొందించిన 'స్టార్టప్'లు కీలక భూమిక పోషిస్తాయని సీతం కళాశాల డీన్ డాక్టర్ వై. నరేంద్రకుమార్ అన్నారు. గురువారం స్థానిక గాజులరేగ పరిధిలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'సమాజంలో స్టార్టప్‌ల పాత్ర – ఇన్నోవేషన్ అంబాసిడర్ల సహకారం కోసం మెంటర్షిప్ మద్దతు' అనే అంశంపై పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిభావంతులైన విద్యార్థుల కొత్త ఆలోచనలకు ఇలాంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ టీడీవీ నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రాణాలు కాపాడుతుంటే దాడులా?

ప్రాణాపాయ స్థితిలో వచ్చిన వారికి ప్రాణం పోసే వైద్యుల పట్ల దాడులు చేయడం దారుణం. వైద్యులు, సిబ్బందిపై దాడులు జరుగుతుంటే ఎలా పనిచేయాలి. రోగులతో వచ్చేవారు కొందరు వైద్యులు, సిబ్బంది పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం రక్షణ చట్టం తీసుకురావాలి.

– పి.లక్ష్మి, పీహెచ్ఎన్, రామభద్రపురం పీహెచ్‌సీ



రక్షణ కల్పించాలి

ఆస్పత్రిలో పనిచేసే మహిళా వైద్య సిబ్బందికి ప్రత్యేకంగా రక్షణ కల్పించాలి. ఆస్పత్రికి రోగులతో వచ్చే ఆకతాయిలపై దృష్టిసారించాలి. వైద్య వృత్తిని నమ్ముకుని, రాత్రీ పగలు కష్టపడి పనిచేస్తున్న వైద్యులకు, సిబ్బందికి గౌరవం ఉండేలా చూడాలి. ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, ప్రత్యేకంగా రెస్ట్‌రూమ్, డ్రెస్ ఛేంజింగ్ రూమ్‌లు వంటివి ఏర్పాటు చేయాలి.

– వి.కళావతి, ఆరోగ్య కార్యదర్శి, లక్ష్మీపురం సచివాలయం, రేగిడి మండలం



పదిమంది గంజాయి నిందితుల అరెస్ట్

● 24 కిలోల గంజాయి, నగదు, బైక్‌లు స్వాధీనం
● నిందితుల్లో నలుగురు జువైనల్స్
● ఎస్పీ వకుల్ జిందాల్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్ (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: జిల్లాకేంద్రం విజయనగరం రైల్వేస్టేషన్ సమీపంలో పాత క్వార్టర్స్ వద్ద గంజాయి విక్రయిస్తున్న నలుగురు జువైనల్స్‌తో సహా పదిమంది నిందితులను అరెస్ట్ చేసి, 24 కిలోల గంజాయి, ఒక స్కూటీ, రూ.1,390 నగదును రికవరీ చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. విజయనగరం పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు, ఒడిశాకు చెందిన వారితో కలిసి విజయనగరం రైల్వేస్టేషన్ సమీపంలోని పాత రైల్వే క్వార్టర్స్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్సై నవీన్ పడాల్, సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి దాడులు చేసి, రైల్వేక్వార్టర్స్‌లో అనుమానాస్పదంగా ఉన్న పదిమందిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వారిలో నలుగురు జువైనల్స్ కూడా ఉన్నారని, వారందరి దగ్గర నుంచి 24 కిలోల గంజాయి, ఒక స్కూటీ, రూ.1,390 నగదు పోలీసులు రికవరీ చేసి విచారణ చేపట్టారన్నారు. విచారణలో విజయ నగరంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన బేత లల్లూ (ఎ1), పడమటి బలిజ వీధికి చెందిన తాలాడ దుర్గాప్రసాద్ (ఎ2), ఫూల్‌బాగ్‌కు చెందిన పెనుగొండ తేజస్వరూప్ (ఎ3),లతో పాటు వరంగల్ క్రిస్టియన్ కాలనీకి చెందిన గడే సుమంత్ అలియాస్ చిన్నూ, ఒడిశాలోని కొరాపుట్ జిల్లా మలిపుట్‌కు చెందిన త్రినాథ్ ఖోరా, ఉత్తరప్రదేశ్‌లోని జాతవ జిల్లా సపాయి గ్రామానికి చెందిన సంతోష్ జాతవ్ అలియాస్ రాజ్‌పాల్ జాతవ్‌లతో పాటు నలుగురు జువైనల్స్ ఉన్నారన్నారు. నిందితులందరూ గంజాయి పీల్చడం, విక్రయించడానికి అలవాటుపడ్డారని చెప్పారు. సుమత్, శ్రీనాథ్, సంతోష్‌లు గంజాయిని ఇతర రాష్ట్రాల నుంచి విజయనగరం తీసుకువచ్చి ఇక్కడ స్థానికంగా ఉంటున్న బేతలల్లూ, తాలాడ దుర్గాప్రసాద్, తేజస్వరూప్‌లకు విక్రయిస్తారన్నారు. వారు పట్టణంలో గంజాయి అవసరం ఉన్నవారికి , చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయించే వారికి అమ్ముతుంటారన్నారు. అంతేకాకుండా నిందితులు చెడు వ్యసనాలకు అలవాటు పడి మొబైల్స్, మోటారు సైకిల్స్‌ను కూడా చోరీ చేస్తుంటారని తెలిపారు. విచారణలో తాలాడ దుర్గాప్రసాద్‌పై 12 క్రిమినల్ కేసులతో పాటు రౌడీహిస్టరీషీట్ కూడా ఉందన్నారు. అదేవిధంగా పెనుగొండ తేజస్వరూప్‌పై ఎనిమిది క్రిమినల్ కేసులున్నాయన్నారు. వీరంతా ఒక గ్రూప్‌గా ఏర్పడి తరచూ గంజాయి పీలుస్తూ, నేరాలకు పాల్పడడం అలవాటుగా మార్చుకున్నారన్నారు. గంజాయి కేసులో సూత్రధారులతో పాటు, చిన్న మొత్తాల్లో విక్రయించే వారిని, గంజాయి పీల్చే వారిని కూడా అరెస్ట్ చేశామని వివరించారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడినా, విక్రయించినా, వినియోగించినా కఠినంగా వ్యవహరిస్తున్నామని, అటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఈ కేసులో క్రియాశీలక పాత్ర పోషించిన వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్సై నవీన్ పడాల్, నరేష్, హెచ్‌సీ ఎం. అచ్చిరాజు, కానిస్టేబుల్స్ ఎస్.మణికంత, టి.శ్రీనివాస్, పి.శివశంకర్, ఎన్.గౌరీశంకర్‌లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్పీ సీఐ కేకేవీ విజయనాథ్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

● క్రీడాకారులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి
● కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



వ్యాయామ ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్‌లను సత్కరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం: ఏ వ్యక్తి అయినా జీవితంలో ఎదుగుదల సాధించాలంటే క్రమశిక్షణతో పాటు, ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హితవు పలికారు. ముఖ్యంగా క్రీడాకారులకు ఇది ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు స్థానిక రాజీవ్ ఇండోర్ స్టేడియంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, విద్యాశాఖ, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం గురువారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ, జిల్లాకు గొప్ప పేరు సంపాదించి పెట్టిన క్రీడాకారులు, కోచ్‌లను అభినందించారు. లక్ష్యాన్ని చేరుకునేవరకు విశ్రమించకూడదని సూచించారు. జిల్లాలో క్రీడలను అభివద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ప్రకటించారు. క్రీడాభివద్ధికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని చెప్పారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి జిల్లాకు, రాష్ట్రానికి గొప్ప పేరు తేవాలని ఆకాంక్షించారు.

క్రీడాకారులకు సత్కారం

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా, అర్జున అవార్డు గ్రహీత, అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారుడు శీర జయరాంతో పాటు జిల్లాకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ క్రీడాకారులు మత్స సంతోషి(వెయిట్ లిఫ్టర్), బంగారు ఉష (వెయిట్ లిఫ్టర్), కె.రమణ (వెయిట్ లిఫ్టర్), ఆర్.మౌనిక (టెన్నికాయిట్), పి.నరసయ్య (ఖోఖో), ఎం.భువన (బీచ్ కబడ్డీ) క్రీడాకారులను సన్మానించారు. క్రీడలపరంగా ఉత్తమంగా ఎంపికైన ఆరికతోట జెడ్పీ ఉన్నత పాఠశాల, జెడ్పీ స్కూల్ పిరిడి, కస్పా మున్సిపల్ ఉన్నత పాఠశాల, బాడంగి డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకులం, సిరిపురం జెడ్పీ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులను, హెడ్ మాస్టర్లను జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు.

పీడీలు, హెచ్ఎంలకు జ్ఞాపికలు

వివిధ క్రీడా విభాగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ఎంపికైన కోచ్‌లను, వివిధ పోటీల విజేతలను, మారథాన్ రన్ విజేతలను, పలువురు క్రీడాకారులను అభినందించి జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ తిరుమలరావు, జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వర రావు, పలువురు కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆగిపోయిన మొబైల్ ఐసీటీసీ సేవలు

● హెచ్ఐవీ నిర్మూలనలో కీలకపాత్ర



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి మార్చురీ వద్ద నిరుపయోగంగా ఉన్న మొబైల్ ఐసీటీసీ వాహనం

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ మహమ్మారి నిర్మూలనలో అత్యంత కీలక ప్రాత వహించే మొబైల్ ఐసీటీసీ వాహనం సేవలు నిలిచిపోయాయి.



హెచ్ఐవీ పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

గ్రామాలకు వెళ్లి హెచ్ఐవీపై అవగాహన కల్పించడంతో పాటు పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని తగ్గించాలనే ఉద్దేశంతో మొబైల్ ఐసీటీసీ సేవల (సంచార సమగ్ర అవగాహన, పరీక్షా కేంద్రం)ను ఏర్పాటు చేశారు. అయితే కొద్ది నెలలుగా ఈ సేవలు నిలిచిపోవడంతో మొబైల్ ఐసీటీసీ వాహనాన్ని మూలన పెట్టేశారు.

హెచ్ఐవీ వ్యాప్తి ఉన్న గ్రామాల్లో పరీక్షలు

హెచ్ఐవీ వ్యాప్తి అధికంగా ఉన్న గ్రామాలకు వెళ్లడానికి నెలకు సరిపడా ప్రణాళికను సిబ్బంది రూపొందించుకునేవారు. ప్రణాళిక ప్రకారం రోజుకు ఒక గ్రామానికి వెళ్లేవారు. అ గ్రామంలో ముందుగా హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించి వ్యాధి లక్షణాల గురించి తెలియజేసేవారు. పరీక్షలు చేయించుకోవాలనే వారికి వాహనంలోనే చేసేవారు. వాహనంలో ల్యాబ్‌టెక్నీషియన్, కౌన్సిలర్ డ్రైవర్ ఉండేవారు. ల్యాబ్ టెక్నీషియన్ హెచ్ఐవీ పరీక్షలు చేయగా, కౌన్సిలర్ వ్యాధిపై అవగాహన కల్పించేవారు. అక్కడ ఎవరికైనా హెచ్ఐవీ నిర్ధారణ అయితే వారిని జిల్లా కేంద్రంలో ఉన్న ఏఆర్‌టీ సెంటర్‌కు పంపించేవారు. ఏఆర్‌టీ సెంటర్‌లో వారికి సీడీఫోర్ కౌంట్ పరీక్ష నిర్వహించి కౌంట్ తక్కువగా ఉన్న వారికి ఏఆర్‌టీ మందులు అందించేవారు. ఏఆర్‌టీ సెంటర్‌లో 8,125 మంది రిజిస్టర్ కాగా వారిలో పురుషులు 3,382 మంది, మహిళలు 4,412, పిల్లలు 315 మంది ఉన్నారు.

సర్వజన ఆస్పత్రిలో వాహనం

మొబైల్ ఐసీటీసీ సేవలు జిల్లాలో నిలిచిపోగా ఐదు నెలలుగా ఆ వాహనం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి మార్చురీ వద్ద నిలిపివేశారు. వాహనం వెళ్లకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో హెచ్ఐవీ పరీక్షలు నిలిచిపోయాయి. ఏవైనా శస్త్రచికిత్సలు, చికిత్స పొందడానికి రోగులు ఆస్పత్రికి వస్తే అక్కడ వారికి హెచ్ఐవీ పరీక్ష చేస్తున్నారు.

ఆదేశాలు రావాలి

ఉన్నతాధికారుల ఆదేశానుసారం మొబైల్ ఐసీటీసీ సేవలను నిలిపివేశాం. మళ్లీ సేవలను కొనసాగించమని ఆదేశాలు వస్తే కొనసాగిస్తాం.

డాక్టర్ కె.రాణి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి

జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు

విజయనగరం అర్బన్: చెన్నైలో ఈ నెల 25న జరిగిన జాతీయ కెన్యురియు చాంపియన్ షిప్ కరాటే పోటీలలో పట్టణానికి చెందిన సత్యడిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవ మణి గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పతకాలు సాధించిన వారిలో పి.కుశ్వంత్‌కుమార్ (కాటా కేటగిరి, కుమిటీ కేటగిరిలో బంగారు పతకం), కె.శివకుమార్ (కాటాలో బంగారు, కుమిటీలో రజత పతకం), పి.హేమంత్ (కాటాలో బంగారు, కుమిటీలో బంగారు పతకం) ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతలు, కోచ్ సంతోష్‌కుమార్‌ను కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణ రావు అభినందించారు.

డిగ్రీ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలను రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) నిర్వహిస్తుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆర్‌బీఐ స్థాపించి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారని చెబుతూ దీనికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏ కళాశాల నుంచైనా విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌బీఐ90క్విజ్.ఇన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు బృందంగా ఏర్పడి కూడా క్విజ్ పోటీలో నమోదు కావచ్చని, బృందంలో కనీసం ఇద్దరు విద్యార్థులు ఉండాలని స్పష్టం చేశారు. పోటీలు స్టేట్‌రౌండ్, జోనల్‌స్థాయి, జాతీయస్థాయిలో జరుగుతాయని తెలిపారు. మొదటి స్థాయిలో స్టేట్ రౌండ్‌లో మొదటి బహుమతి రూ.2 లక్షలు, రెండవ బహుమతి రూ.1.50 లక్షలు, మూడవ బహుమతి రూ.1 లక్ష ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే జోనల్ స్థాయిలో మొదటి బహుమతి రూ.5 లక్షలు, రెండవ బహుమతి రూ.4 లక్షలు, మూడవ బహుమతి రూ.3 లక్షలు ఇవ్వనున్నారన్నారు. జాతీయస్థాయిలో జరిగే తుది పోటీలలో మొదటి బహుమతి రూ.10 లక్షలు, రెండవ బహుమతి రూ.8 లక్షలు, మూడవ బహుమతి రూ.6 లక్షలు ప్రదానం చేస్తారని తెలిపారు.

సెప్టెంబర్ 17లోపు రిజిస్ట్రేషన్

జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ జేఎల్ఎస్ మూర్తి మాట్లాడుతూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లను సెప్టెంబర్ 17వ తేదీ లోపు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. దరఖాస్తు రిజిస్ట్రేషన్ కోసం ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదని, ఈ అవకాశాన్ని డిగ్రీ చదివే విద్యార్థులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు అధికారి ఎస్ఎస్.శోభిక, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై . సత్యం నాయుడు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయి కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవీ. కరుణాకర్, పార్వతీపురం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎ.మురళీధర్, నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి డీఎస్.దినేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువకుల మృతి



ప్రభుదేవ్ (ఫైల్)

పాలకొండ రూరల్: మండలంలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ప్రమాదాలకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పాలకొండ పట్టణ పరిధి సిరికొండ వద్ద బుధవారం అర్ధరాత్రి బైక్ అదుపు తప్పడంతో స్తంభాన్ని ఢీకొని సీతంపేట మండలంలోని వాబ గ్రామానికి చెందిన ఎస్.ప్రభుదేవ్(18) మృతి చెందాడు. ప్రభుదేవ్ పాలకొండ పట్టణ పరిధిలోని ఎన్కె.రాజపురం వద్ద ఓ బైక్ షెడ్‌లో పనిచేస్తున్నాడు. రోజులాగానే విధులు ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా సిరికొండ మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో రోడ్డు పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొని మృతిచెందాడు. గురువారం స్థానికులు ఈ ప్రమాదాన్ని గురించి మృతుని కుటుంబసభ్యులకు తెలియజేయగా వారు చేసిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.ప్రయోగమూర్తి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి పోలీసులు మృతదేహాన్ని తరలించారు.

నాగావళి నదిలో పడి మరో యువకుడు

విజయవాడకు చెందిన కోరాడ కార్తికేయ(17) పాలకొండ మండలంలో గల నాగావళి నదిలో పడి మృతిచెందాడు. మండలంలోని యరకారాయపురం గ్రామానికి శుభకార్యం నిమిత్తం వచ్చిన కార్తికేయ సహచరులతో కలిసి గురువారం సాయంత్రం గ్రామసమీపంలో గల నాగావళి నదీ తీరానికి స్నానానికి వెళ్లాడు. ఈ క్రమంలో కార్తికేయ నదీగర్భంలో చిక్కుపోవడంతో సహచరులు ప్రమాద విషయాన్ని గ్రామస్తులకు తెలిపారు హుటాహుటిన గ్రామస్తులు నదీతీరంలో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఇంతలో మృతదేహం బయటపడడంతో మృతుని బంధువు కోరాడ ధనుంజయ అందించిన ఫిర్యాదుతో ఎస్సై ప్రయోగమూర్తి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సైనిక్ స్కూల్‌లో చదవడం అసాధారణ అవకాశం

● కమోడోర్ రాజేష్‌కుమార్ శర్మ
● స్కూల్‌లో శాతవాహన బాలికల వసతిగృహం ప్రారంభం



శాతవాహన బాలికల వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న కమోడోర్ రాజేష్‌కుమార్ శర్మ

విజయనగరం: సైనిక్ స్కూల్స్ సొసైటీకి చెందిన ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్ కమోడోర్ రాజేష్ కుమార్ శర్మ గురువారం విజయనగరం మండలంలోని కోరుకొండలో గల సైనిక్ స్కూల్‌ను సమగ్రంగా తనిఖీ చేశారు. దేశంలోని అన్ని సైనిక్ స్కూల్స్ వార్షిక తనిఖీలో భాగంగా మూడు రోజుల పాటు చేపట్టిన తనిఖీలు బుధవారం ముగిశాయి. ముందుగా దేశం కోసం త్యాగం చేసిన వీర జవాన్‌లకు నివాళులు అర్పిస్తూ వార్ మెమోరియల్ వద్ద ఆయన పుష్పాంజలి ఘటించారు. అనంతరం క్యాడెట్లు అందించిన గార్డ్ ఆఫ్ హానర్ ఆకట్టుకుంది. తదనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక అసెంబ్లీలో క్యాడెట్‌లు, సిబ్బందిని ఉద్దేశించి రాజేష్‌కుమార్ శర్మ ప్రసంగించారు, భారతదేశ విద్యారంగంలో సైనిక్ పాఠశాలల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కోరుకొండలోని సైనిక్ స్కూల్‌లో క్యాడెట్‌గా ఉండడం అసాధారణమైన అవకాశంగా గుర్తించాలని చెప్పారు. క్రమశిక్షణ, ధైర్యం, అంకిత భావం విలువలను అందరూ స్వీకరించాలని పిలుపునిచ్చారు. క్యాడెట్ హౌస్‌లు, స్విమ్మింగ్ పూల్, మోటివేషనల్ హాల్, మ్యూజియం, ఇన్‌స్ట్రక్షన్ బ్లాక్‌లతో సహా పాఠశాల సౌకర్యాలను విస్తృతంగా తనిఖీ చేశానని చెప్పారు. అనంతరం కమోడోర్ ఆర్‌కే శర్మ కొత్తగా నిర్మించిన శాతవాహన బాలికల వసతి గృహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ /వింగ్ కమాండర్ అభిలాష్ బాలచంద్రన్ పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹108	₹186	₹196

పికప్ వ్యాన్ నుంచి జారిపడి వ్యక్తి మృతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పి.ఆమిటి జంక్షన్ సమీపంలో ప్రధాన ఆర్ అండ్‌బీ రోడ్డులో పికప్ వ్యాన్ నుంచి జారిపడి గవరమ్మపేట గ్రామానికి చెందిన దినసరి కూలీ బోగిల సింహాచలం (35) మృతిచెందాడు. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. రోజు కూలీ సింహాచలం సమీప గ్రామస్తుల(కన్నపుదొర వలస)తో కలిసి కాంక్రీట్ పనులకు వెళ్తుంటాడు. ఈ క్రమంలోనే గురువారం కూడా పికప్ వ్యాన్‌లో వెళ్తుండగా పి.ఆమిటి జంక్షన్‌కు చేరుకోగానే ఫిట్స్ రావడంతో వ్యాన్ నుంచి జారి కింద పడిపోయాడు. దీంతో వ్యాన్‌కు కట్టిన మిల్లర్ సింహాచలం శరీరంపై ఎక్కిపోవడంతో తీవ్ర గాయాల య్యాయి. హుటాహుటిన అక్కడి వారు క్షతగాత్రుడ్ని భద్రగిరి సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటనపై ఎల్విన్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి

గంట్యాడ: మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన ఎం.అప్పారావు (50) బుధవారం సాయంత్రం చెట్టుపై నుంచి జారిపడి మృతిచెందాడు. నేరేడు కొమ్మ కొట్టేందుకు చెట్టు ఎక్కిన అప్పారావు కొమ్మ కొడుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు వీఆర్వో శంకరరావు తెలిపారు.

క్రీడా ప్రతిభను వెలికితీయాలి

● కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల్లో ఇమిడి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి వెలికితీయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలను స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో కలిసి ఆయన ప్రారంభించారు. ముందుగా భారత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తన ఆట ప్రదర్శనతో భారత దేశానికి అపారమైన కీర్తిని, ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించిన క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ అని కొనియాడారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ క్రీడాల్లోనూ రాణించి జాతీయ స్థాయిలో పేరు, ప్రఖ్యాతులు సాధించవచ్చన్నారు. క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటములు సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని హితవు పలికారు. అనంతరం నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో కురుపాం నియోజవర్గం ప్రథమస్థానం, సాలూరు నియోజక వర్గం ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాయి. ఆర్చరీ (విలువిద్య) పోటీల పలు విభాగల్లో కాంపౌండ్ బాయ్స్ విభాగంలో పి.లోకేష్ ప్రథమ స్థానం, చేతన్ స్వరూప్ ద్వితీయం, కాంపౌండ్ గర్ల్స్ జి.తన్విక, జి.తనీషా, రికర్వ్ బాయ్స్ ఎ.కల్యాణ్, ఎన్.జయంత్, బి ఫణీంద్ర, రికర్వ్ గర్ల్స్ పి.త్రివేణి, ఎన్.హేమన్య, ఇండియన్ బాయ్స్ డి.పవన్ కుమార్, జె.దేవిప్రసాద్, ఇండియన్ గర్ల్స్ ఎస్.అఖిల, బి ప్రియలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

క్రీడాకారులకు సన్మానం

అనంతరం 2023–24 సంవత్సరం క్రీడా ప్రతిభ అవార్డులను కలెక్టర్, ఎమ్మెల్యే బహూకరించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను సన్మానించారు. ప్రతిభా అవార్డుల్లో ఉల్లిభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, పాచిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం, సాలూరు మండలంలోని పురోహితుని వలస ఏపీఎంఎస్ తృతీయ స్థానం, కొత్తగూడ జీటీడబ్ల్యూఏ ఉన్నత పాఠశాల నాల్గవ స్థానం, నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఐదవ స్థానం సాధించాయి. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి జి.పగడాలమ్మ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డీటీ గాంధీ, పీఈటీల సంఘం అధ్యక్షుడు ఎం.రామ కృష్ణ, కార్యదర్శి ఎం.మురళీకృష్ణ, వీడీఎస్ కె.తిరుపతి రావు, క్రీడాకారులు, తదితరులు, పాల్గొన్నారు.